సాక్షి ములుగు

శుక్రవారం । 14 । జూన్ । 2024



బక్రీద్‌కు పొట్టేళ్లు రెడీ..

బక్రీద్.. త్యాగం, దానధర్మాలకు ప్రతీక. ఈ పర్వదినం రోజున ఖుర్బానీ ఇవ్వడం ముస్లింల ఆచారం.

- 8లో▸



పోలీసులు నిబద్ధతతో పనిచేయాలి

పోలీసులు క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేస్తే గుర్తింపు లభిస్తోందని టీఎస్ఎస్పీ బెటాలియన్ల డీఐజీ ఎంఎస్ సిద్ధిఖ్ అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
36.0^0/27.0^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోత ఉంటుంది. రాత్రి అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాలల సంరక్షణ అందరి బాధ్యత



వాజేడు: బాలల సంరక్షణ అందరి బాధ్యతని వెంకటాపురం ఐసీడీఎస్ సీడీపీవో ముత్తమ్మ అన్నారు. మండల పరిధిలోని పేరూరు గ్రామంలో గురువారం కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాలల పరిరక్షణపై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మేజర్లు కాకుండా పెళ్లిళ్లు చేయవద్దని మైనారిటీ తీరని వారిని పనికి పంపించవద్దన్నారు. చదువుకునే వయస్సు ఉన్న ప్రతీ ఒక్కరిని పాఠశాలలకు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ కామేష్, వెంకటాపురం(కె) కోఆర్డినేటర్ హనుమంతు, యానిమేటర్లు ప్రసాద్, భాస్కర్, స్వరూప, రమాదేవి పాల్గొన్నారు.

24గంటల్లో కోర్టులో హాజరుపర్చాలి



వెంకటాపురం(కె): తడపల అటవీ ప్రాంతంలో ఈ నెల 12వ తేదీన గ్రేహౌండ్స్ పోలీసులు పట్టుకున్న ముగ్గురు మావోయిస్టు సభ్యులు రీతా, మోతీ, ఇడ్మాలతో పాటు పనుల రీత్యా అటవికి వెళ్లిన మరో ముగ్గురిని 24గంటల్లో కోర్టులో హాజరుపర్చాలని వెంకటాపురం, వాజేడు మావోయిస్టు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరున సోషల్ మీడియాలో గురువారం నుంచి లేఖ వైరల్ అవుతోంది. పట్టుకున్న వారిని ఎన్‌కౌంటర్ పేరుతో చంపేందుకు ప్రయత్నం చేస్తున్నారని, ఎలాంటి సంబంధం లేని మరో ముగ్గురు అమాయకులను బాంబుల గురించి చెప్పాలంటూ చిత్రహింసలకు గురి చేయడం సరికాదన్నారు. దీన్ని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు పోలీసులు చేస్తున్న అక్రమ అరెస్టులను ఖండించాలని లేఖలో పేర్కొన్నారు.

ఏడు కిలోల గంజాయి స్వాధీనం



భద్రాచలం అర్బన్: అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు గురువారం పట్టుబడ్డారు. కాటారం మండలానికి చెందిన రేకుల సాయికుమార్, పెద్దపల్లి జిల్లా కొలనూర్‌కు చెందిన ఏకుల సజన్‌కుమార్ వరంగల్‌లో ఫొటోగ్రాఫర్లుగా జీవనం సాగిస్తున్నారు. వీరు జల్సాలు, గంజాయికి అలవాటు పడ్డారు. డబ్బు సరిపోకపోవడంతో అక్రమంగా గంజాయిని తీసుకొచ్చి అమ్ముకుంటూ సంపాదించాలనే నిర్ణయానికి వచ్చారు. దీంతో సాయికుమార్ స్నేహితుడైన మండల కుమార్ బైక్ తీసుకుని ఇటీవల ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లాకు వెళ్లారు. అక్కడ 7.3 కేజీల గంజాయి కొనుగోలు చేసుకుని తిరిగి వస్తున్నారు. భద్రాచలంలో చేపట్టిన వాహన తనిఖీల్లో ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని రూ.3లక్షల విలువైన గంజాయితో పాటు బైక్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

పారదర్శకతతో ఉపాధి పనులు



కాటారం: ఉపాధి హామీ పనులు పారదర్శకతతో నిర్వహించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నరేష్ సూచించారు. సామాజిక తనిఖీ ప్రజావేదిక గురువారం కాటారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ నరేష్ మాట్లాడుతూ ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచడంతో పాటు అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాలని సూచించారు. అవకతవకలకు సంబంధించి రికవరీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈసీ రుబీనా, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, అంబుడ్స్‌మెన్ శ్రీనివాస్, ఎస్టీఎం సాయివి/వ్రాస్, ఎస్ఆర్‌పీ కొంరయ్య, ఎంపీడీఓలు శంకర్‌నాయక్, బాబు పాల్గొన్నారు.

‘మర’ మనిషి లెక్కలు?

ఇసుక క్వారీల్లో యంత్రాలతో పనులు

- రికార్డుల్లో మాత్రం మనుషుల పేర్లు
- క్వారీల వద్ద వేబ్రిడ్జిలు కరువు
- లారీల్లో అదనంగా ఇసుక లోడ్ చేస్తున్న టీజీఎండీసీ సిబ్బంది

ములుగు: ఇసుక క్వారీల నిర్వహణలో గుత్తేదార్లు ప్రభుత్వానికి చూపించే లెక్కలకు, స్థానిక లెక్కలకు పొంతన లేకుండా పోతోంది. జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతాలైన కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం(కె), మంగపేట మండలాల పరిధిలోని జరుగుతున్న ఇసుక రవాణా తతంగం ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పెసా యాక్టు 170, ఎల్టీఆర్ చట్టం ప్రకారం 59, 63 జీఓ ఎంఎస్ ఆధారంగా స్థానికంగా ఎలాంటి చర్యలు కనిపించడం లేదు. ఇసుక క్వారీల అనుమతి ఇచ్చే క్రమంలో కలెక్టర్‌తోపాటు ఏడీ మైన్స్, గ్రౌండ్ వాటర్, ఐబీ, పర్యావరణ శాఖతోపాటు స్థానిక రెవెన్యూ అధికారులు క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే, ఏజెన్సీ ప్రాంతాల్లో నడుస్తున్న ఇసుక క్వారీలకు అన్ని శాఖల అనుమతులు సక్రమంగా ఉన్నట్లుగా పత్రాలు ఉన్నాయి. నిబంధనల మేరకు ఇసుక క్వారీల్లో ఆయా మండలాల పరిధిలోని గిరిజన సొసైటీలకు అప్పగించాల్సి ఉంటుంది. ఈ ప్రకారం క్వారీల నుంచి ఇసుకను తోడడంతో పాటు ట్రాక్టర్లలో నింపడానికి అక్కడ నుంచి స్టాక్ పాయింట్లకు తరలించడం వరకు కూలీలతోనే పనులు చేయించాల్సి ఉంటుంది. వీటికి క్యూబిక్ మీటరుకు కొంత చొప్పున మస్టర్ ఆధారంగా స్థానికులకు చెల్లింపులు ఉంటాయి.

కన్నాయిగూడెంలోని రెండు క్వారీల్లో..

కన్నాయిగూడెం మండలంలోని ఏటూరు, సింగారం గ్రామాల పరిధిలోని పట్టా భూముల్లో ఇసుక మేటలు తొలిగించారు. భూములను సాగుకు పనికి వచ్చే విధంగా చేసుకునేందుకు రైతుల పేరుతో ప్రభుత్వ అనుమతులతో చేపట్టిన రెండు ఇసుక క్వారీలు నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నాయి. క్వారీలో సీసీ కెమెరాలు, వేబ్రిడ్జి కాంటాలు ఏర్పాటు చేయకుండా నిర్వాహకులు సంబంధిత టీజీఎండీసీ సిబ్బందితో కుమ్మక్కై పరిమితికి మించి గంపగుత్తగా లోడింగ్ చేస్తున్నారు. ఒక్కో లారీ నుంచి లోడింగ్ చార్జీ పేరుతో రూ.3,500, ఒక్కో అదనపు బకెట్‌కు రూ.1800 వరకు వసూలు చేస్తూ జేబులు నింపుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. క్వారీల్లో జరుగుతున్న అక్రమాలను అరికట్టాల్సిన ప్రభుత్వ యంత్రాంగం ప్రేక్షక పాత్ర పోషించడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ అనుమతుల ప్రకారం స్థానిక లేబర్‌కు పనికల్పిస్తూ ఆయా గ్రామాల అభివృద్ధికి ఉపయోగ పడాల్సి ఉన్నా కాంట్రాక్టర్లు పెద్ద పెద్ద యంత్రాలను వినియోగిస్తూ స్థానిక లేబర్‌కు అందాల్సిన డబ్బులను కాజేస్తూ జేబుల్లో వేసుకుంటున్నారు. లోడ్ లారీకి బరకం(పరదా) కప్పి తాడు కట్టినందుకు ఒక్కో లారీ కి డ్రైవర్లు ఇచ్చే రూ.800పై మాత్రమే ఆధారపడుతున్నారు.

రైతుల పట్టాభూముల పేరుతో అనుమతులు

మంగపేట మండల పరిధిలోని బోరునర్సాపురం, కత్తిగూడెం, పొదుమూరు గ్రామాల్లో రైతుల పట్టాభూముల పేరుతో ఇసుక క్వారీలకు అనుమతులు పొందిన కాంట్రాక్టర్లు యథేచ్ఛగా గౌరారం వాగు, గోదావరి మధ్యలో ఇసుక తవ్వకాలు జరిపారు. ఈ విషయంపై స్థానికులు, గిరిజన సంఘాల నాయకులు రెవెన్యూ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఆయా క్వారీల్లో ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. అదే విధంగా మల్లూరు, చుంచుపల్లిలో మూడు, రమణక్కపేట, రాజుపేటలో గిరిజన సొసైటీల పేరుతో ఇసుక క్వారీ నిర్వహణకు అనుమతి పొందారు. ఆయా ఇసుక క్వారీల్లో కూలీలు ఇసుకను ట్రాక్టర్లలో లోడ్ చేసి స్టాక్ యార్డుకు తరలించాలనే నిబంధనలు ఉన్నాయి. కానీ క్వారీల్లో ఒక్కరు కూడా పనిచేయక పోవడం గమనార్హం.

అధికారిక వే బ్రిడ్జిలు కరువు

వెంకటాపురం(కె) మండల పరిధిలోని వీరభద్రావరం, ముత్తారంలో క్వారీలు నడుస్తున్నాయి. గత వారం పోలీసులు తనిఖీ చేసి ప్రైవేట్ వే బ్రిడ్జికి తరలించేంత వరకు ఇసుక అక్రమ రవాణా అంశం బయటికి రాలేదు. మండలంలోని పై రెండు క్వారీల్లో అధికారిక వే బ్రిడ్జిలు లేవు. దీంతో అధికారులు, వ్యాపారులు ఆడిందే ఆట పాడిందే పాట అన్నచందంగా మారింది.

కలెక్టర్‌కు తెలియకుండానే ఉంటుందా?

ప్రతీ చిన్న విషయంలో జీఓ కాపీ తీసుకురావాలని చెప్పే జిల్లా కలెక్టర్‌కు గోదావరి పరీవాహక ప్రాంతంలో జరుగుతున్న ఇసుక క్వారీల దోపిడీ తెలియకుండా ఉంటుందా అని జిల్లా వాసులు చర్చించుకుంటున్నారు. అనుమతి ఇచ్చే క్రమంలో అన్ని రకాల పత్రాలను చూసే ఉన్నతాధికారులు గిరిజన ప్రాంతంలో గిరిజనులకు జరుగుతున్న అన్యాయాన్ని ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

ఈ విషయంలో కలెక్టర్, అధికారుల తీరుపై ముక్కున వేలుసుకుంటున్నారు. పైగా మంత్రి సీతక్క ఇలాఖలో ఈ రకమైన ఇసుక దౌర్జన్యాన్ని సోషల్ మీడియా వేదికగా బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు.

విలేజ్ డెవలప్‌మెంట్ ఫండ్ చెల్లింపులేవి?

జిల్లాలోని ఏ ఇసుక క్వారీలో నిబంధనలు అమలు కావడం లేదు. దీంతో పాటు ఇసుకక్వారీ నుంచి గ్రామం మీదుగా లోడుతో వెళ్లే లారీల ద్వారా ఆయా గ్రామాల అభివృద్ధికి విలేజ్ డెవలప్‌మెంట్ ఫండ్ చెల్లించాల్సి ఉంటుంది. అవేమీ పట్టించుకోకుండా కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై గట్టిగా అడిగిన వారికి కొంత అప్పగించి నోరు మూయిస్తున్నారు. క్వారీల పక్కనే టీజీఎండీసీ తరఫున వేబ్రిడ్జి ఏర్పాటు చేసి లెక్క ఆధారంగా ఇసుకను తరలించాల్సి ఉంటుంది. కానీ, అధికారికంగా వేబ్రిడ్జిలు లేకపోవడంతో ఇదే అదునుగా గుత్తేదారులు, టీజీఎండీసీ, ఇసుక లారీల యజమానులు కుమ్మక్కై అధిక లోడ్‌తో ఇసుకను తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



లారీలో ఇసుక నింపుతున్న జేసీబీ



ఇసుక లారీలను ప్రైవేట్ వే బ్రిడ్జి వద్ద కాంటా వేయిస్తున్న ఎస్సై అశోక్



ఇసుక లారీలను అడ్డుకున్న చింతూరు గ్రామస్తులు

ఇసుక లారీల అడ్డగింత

వాజేడు: ఇసుక లారీలు తిరగడం మూలంగా ప్రధాన రహదారి పూర్తిగా పాడవుతుందని ఈ దారి గుండా లారీలు నడపవద్దని చింతూరు గ్రామస్తులు గురువారం లారీలను ఆపి నిరసన తెలిపారు. మండల పరిధిలోని ధర్మవరం, అయ్యవారిపేట గ్రామాల్లో ఉన్న ఇసుక క్వారీలకు ధర్మవరం వద్ద రహదారి ఉన్నా చింతూరు గ్రామ రహదారి గుండా లారీలు వస్తున్నాయని తెలిపారు. చింతూరులో ఇసుక క్వారీ లేకపోయినా ప్రతిరోజూ వందల లారీలు తిరగడం వల్ల రోడ్డు మొత్తం పాడైపోయిందని అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులు నిరసన చేస్తున్నప్పటికీ అధికారులు రాకపోవడంతో మాజీ సర్పంచ్ తెల్లం బుల్లేశ్వర్‌రావు అక్కడికి వచ్చి అధికారుల వద్దకు వెళ్లి సమస్యపై మాట్లాడుదామని గ్రామస్తులను కోరడంతో నిరసనను విరమించారు.

ఆశ కార్యకర్తలకు పరీక్షలు నిర్వహించొద్దు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

ములుగు రూరల్: ఆశ కార్యకర్తలకు ప్రభుత్వం పరీక్షలు నిర్వహించే విధానాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేస్తూ ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు పారితోషికాలు కాకుండా కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందిస్తున్న వారిక కనీస వేతనం అమలు చేయకుండా శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. ఆశ కార్యకర్తలు ధర్నా విరమించకపోవడంతో జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య ఆశ కార్యకర్తల నుంచి వినతిపత్రం స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కతో మాట్లాడి న్యాయం జరిగే విధంగా చూస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గుండబోయిన రవిగౌడ్, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రావ్య, మంజుల. నాగమణి, రాజ్యలక్ష్మీ, రాధ, సరిత, రజిత, శోభ, కవిత, అరుణ పాల్గొన్నారు.

మినీ గురుకులాల్లో ప్రవేశాలకు ఆహ్వానం

ఎస్ఎస్‌తాడ్వాయి: ములుగులోని జాకారం, తాడ్వాయి మండలంలోని పోచపూర్ మినీ గురుకులం బాలికల పాఠశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆర్‌సీఓ రాజ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటవ తరగతిలో అడ్మిషన్ పొందే విద్యార్థినులకు 5ఏళ్లు నిండి ఉండాలని వివరించారు. మినీ గురుకులం జాకారంలో 4వ తరగతిలో 8 సీట్లు, 5వ తరగతిలో 18 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థినుల తల్లిదండ్రులు సంబంధిత పాఠశాలల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాలకు జాకారం పాఠశాలలో ఫోన్ నంబర్లు 9618227739, 7569988684, పోచపూర్ పాఠశాలలో దరఖాస్తులకు 9491653478, 9441776319 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బదిలీల జోష్!



- ప్రభుత్వశాఖల్లో బదిలీల సందడి.. పోలీసుశాఖలో మొదలు
- వైద్య, ఆరోగ్యశాఖపై నివేదికలు సిద్ధం
- 'ఇరిగేషన్'లో లాంగ్‌స్టాండింగ్‌లపై ఆరా..
- అన్ని శాఖల్లో బదిలీలపై సాగుతున్న కసరత్తు
- దీర్ఘకాలికంగా ఒకేచోటున్న వారికి స్థానచలనం

సాక్షిప్రతినిధి, వరంగల్: ప్రభుత్వశాఖల్లో బదిలీల జోష్ కొనసాగుతోంది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక చేపట్టాల్సిన ట్రాన్స్‌ఫర్లు వివిధ కారణాలతో ఆగిపోయాయి. ప్రజాపాలనపై తమ ముద్ర వేసుకోవాలనుకున్నా.. అసెంబ్లీ ఎన్నికల వెంటనే లోక్‌సభ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రావడం వల్ల సాధ్యం కాలేదు. ఉమ్మడి వరంగల్‌లో అక్కడక్కడా కొన్ని బదిలీలు జరిగినా.. అవి కేంద్ర ఎన్నికల సంఘం సూచనలు, మార్గదర్శకాల మేరకు అనివార్యమయ్యాయి. ఈనెల 6తో ఎన్నికల కోడ్ తొలగిపోగా.. అదేరోజు నుంచి పాలనపై దృష్టి సారించిన ప్రభుత్వం బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారులు కోరుకున్నచోట పోస్టింగ్‌లు కొట్టేందుకు ప్రజాప్రతినిధుల లేఖలు సంపాదించి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అలాగే నీటిపారుదల, వైద్యారోగ్యశాఖ, అటవీశాఖలలో దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేస్తున్న వారికి సైతం స్థానచలనం కల్పించేందుకు జాబితా సమర్పించాలని గురువారం ఆయాశాఖ అధికారులకు ఆదేశాలు అందాయి.

పది రోజుల్లో ప్రక్రియ పూర్తయ్యేలా...

బదిలీల ప్రక్రియ పది రోజుల్లో పూర్తయ్యేలా ఆయా శాఖల ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు యూనిట్లు, డివిజన్లు, సర్కిళ్ల వారీగా జాబితాను ఇవ్వాలని సర్క్యులర్ జారీ చేశారు. ఒక్కడుగు ముందుకేసిన పోలీసుశాఖ ఉన్నతాధికారులు మూడు రోజుల కిందటే మల్టీజోన్-1 పరిధిలో 13 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వారం రోజులలోపే సబ్ ఇన్‌స్పెక్టర్ నుంచి జిల్లాస్థాయి వరకు పలువురు అధికారుల బదిలీ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని చెబుతున్నారు. నీటిపారుదలశాఖకు సంబంధించి ఉమ్మడి వరంగల్‌లో రెండు సర్కిళ్లు, ఇద్దరు చీఫ్ ఇంజనీర్లు ఉండగా.. ములుగు సర్కిల్‌కు మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు, వరంగల్ సర్కిల్ కిందకు 9 నియోజకవర్గాలు వస్తాయి. ఈ రెండు సర్కిళ్ల పరిధిలో సుమారుగా 40కిపై డివిజన్లు, సబ్ డివిజన్లున్నాయి. వీటిలో కొందరు ఎస్ఈలు, ఈఈలు, డిప్యూటీ ఈఈలు ఇన్‌చార్జులుగా పనిచేస్తుండగా.. చాలామంది దీర్ఘకాలికంగా పనిచేస్తున్న వారు ఉన్నారు. దీంతో బదిలీల ప్రక్రియలో భాగంగా ఈ ఏడాది మే31న ప్రాపార్మాలో సూచించిన ప్రకారం లాంగ్‌స్టాండింగ్‌లో పనిచేస్తున్న టీఐఈఎస్ఎస్ (టెక్నికల్ అసిస్టెంట్ నుంచి టెక్నికల్ ఆఫీసర్ వరకు) కేడర్ వివరాలు హెడ్‌క్వార్టర్స్ వారీగా పంపించాలని ఇరిగేషన్ ఈఎన్‌సీ (అడ్మిన్) గుమ్మడి అనిల్‌కుమార్ గురువారం యూనిట్ ఆఫీసర్లను ఆదేశించారు. ఈనెల 20లోగా తనకు జాబితాను మెయిల్ ద్వారా అందించాలని సూచించారు. అదే విధంగా వైద్య ఆరోగ్య, అటవీ, రెవెన్యూశాఖల్లోనూ బదిలీల ప్రక్రియపై కసరత్తు వేగంగా సాగుతోంది.

డిప్యుటేషన్ల దందాకు తెరపడేనా..!

వైద్య, ఆరోగ్యం సహా పలు శాఖల్లో ఏళ్ల తరబడిగా గత ప్రభుత్వం బదిలీలను నిలిపి వేసింది. ముఖ్యంగా వైద్య ఆరోగ్యశాఖలో వివిధ కేడర్‌లకు చెందిన పలువురు 'డిప్యుటేషన్'ల పేరిట కోరుకున్నచోట కొలువు చేసే దందాకు తెరతీశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడ్డాక డిప్యుటేషన్లను రద్దు చేసింది. హనుమకొండ, వరంగల్, జనగామ, జేఎస్ భూపాలపల్లి జిల్లాల్లో ఏఎన్ఎం నుంచి డీఎంహెచ్‌ఓ వరకు వివిధ కేడర్‌లలో పనిచేస్తున్న పలువురికి స్థానచలనం కలిగింది. తప్పనిసరి అనుకున్న చోట కొందరు డీఎంహెచ్‌ఓలను కొత్త ఉత్తర్వులతో కొనసాగించారు. ఇంత జరిగాక కూడా వివిధ విభాగాల్లోని 16 మంది ఉద్యోగులను డిప్యుటేషన్లకు అనుమతివ్వాలని కోరుతూ జనగామ జిల్లా వైద్యాధికారులు కలెక్టర్ రిజ్వాన్ బాషా దగ్గర పైరవీ చేయడం కూడా అప్పట్లో వివాదాస్పదమైంది. తాజాగా వైద్యశాఖ పరిధిలోని ప్రజారోగ్య, వైద్య విధానపరిషత్, విద్య డైరక్టరేట్‌ల కింద పనిచేసే సిబ్బంది, అధికారుల బదిలీలకు కసరత్తు జరుగుతోందని ప్రకటన వెలువడింది. దీంతో ఉమ్మడి వరంగల్‌లోని అన్ని కేడర్‌లలో పనిచేస్తున్న సుమారు 491 మందికి స్థానచలనం కలిగే అవకాశం ఉంది. ఈ సంఖ్య పెరగవచ్చని కూడా అధికారులు చెబుతున్నారు. కాగా ఈసారి బదిలీల్లో ఉద్యోగులకు ఇబ్బంది కలిగించేలా గత ప్రభుత్వ హయాంలో విడుదలైన 317 జీఓపై స్పష్టత ఇవ్వాలని ఉద్యోగులు, ఉద్యోగసంఘాల నాయకులు కోరుతున్నారు. రాష్ట్రపతి ఉత్తర్వులు, స్థానికత ఆధారంగా వెలువడిన ఉత్తర్వులను పక్కనపెట్టి ఉద్యోగి హోదా, సీనియారిటీ అని చెప్పి అడిగిన ప్రాధాన్యతలలో ఏదీ వర్తించలేదంటున్నారు. ఉద్యోగికి ఫస్ట్ ప్రిఫరెన్స్, సెకండ్ ప్రిఫరెన్సన్నా రాకపోగా, ఆయా జిల్లాల్లో ఉన్న అన్ని పోస్టులను నింపకుండా కొన్ని ఫ్రీజ్ చేసి సుదూర ప్రాంతాల్లో ఉన్న జిల్లాలకు పంపించారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈసారి నిర్వహించే బదిలీల ప్రక్రియలో అన్ని కేడర్‌ల ఉద్యోగులు, అధికారులకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నారు. ఈ బదిలీల ప్రక్రియతోనైన వైద్య, ఆరోగ్యశాఖలో డిప్యుటేషన్ల దందాకు తెరపడుతుందా? అన్న చర్చ కూడా జరుగుతోంది.

ముంపు శాశ్వత నివారణకు ప్రణాళికలు

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా అధికారుల సమీక్షలో మంత్రి సీతక్క



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క



విద్యార్థికి పాఠ్యపుస్తకాలు అందిస్తున్న మంత్రి

ములుగు: వానాకాలంలో కురిసే అధిక వర్షాల కారణంగా ముంపు ప్రాంతాల సంరక్షణకు శాశ్వత ప్రాతిపదికన ప్రణాళికను సిద్ధం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఆయా శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో ముంపు ప్రాంతాల్లో ఎదుర్కొన్న సమస్యలు పునరావృతం కాకుండా ఏ విధంగా ముందుకు సాగాలనే అంశంపై అన్ని శాఖల అధికారులు సమన్వయంగా నడుచుకోవాలన్నారు. ఎన్నికల కారణంగా ఇప్పటికే మూడు నెలల సమయం వృథా అయిపోయిందన్నారు. అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏర్పాట్లకు సంబంధించిన నిధులు తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నానని మంత్రి హామీ ఇచ్చారు. ముఖ్యంగా గ్రామాలకు అందించే తాగునీరు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అంటు వ్యాధుల నిర్మూలను చేపడుతున్న కార్యక్రమాలపై ఆరా తీశారు. ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ గ్రామాల వారీగా సీజనల్ వ్యాధులు, ఫీవర్ సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఐటీడీఏ ఏటూరునాగారంలో 24/7 కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని సూచించారు. 2023వ సంవత్సరంలో వరదముంపును ఎదుర్కోవడానికి తీసుకున్న జాగ్రత్తలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా, ఎస్పీ శబరీశ్, అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందర్‌జీ, ఏఎస్పీ మహేష్ బాబాసాహెబ్ గీతే, డీఎఫ్‌ఓ రాహుల్ కిషన్ జాదవ్, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

ములుగు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించటం జరుగుతుందని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయని మంత్రి సీతక్క అన్నారు. బండారుపల్లి ఆదర్శ పాఠశాలలో మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి 2024-25 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా ఏకరూపదుస్తులు, పాఠ్య పుస్తకాలు, ఉచిత భోజనం, ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు ఉచిత వసతి కల్పించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను నియమించినట్లు తెలిపారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

వెంకటాపురం(ఎం): రామప్ప ఆలయ పరిసర ప్రాంతంలో నిర్మిస్తున్న ప్రసాద్ ప్రాజెక్టు పనులను నాణ్యత ప్రమాణాలతో అక్టోబర్ మాసంలోపు పూర్తి చేయాలని మంత్రి సీతక్క కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రామప్ప ఆలయ పరిసర ప్రాంతంలో ప్రసాద్ స్కీంలో భాగంగా చేపడుతున్న ఇంటర్ ప్రిటేషన్ సెంటర్ పనులను ఆమె గురువారం పరిశీలించారు. రామప్పలో పది ఎకరాల విస్తీర్ణంలో రూ.62 కోట్లతో పనులు జరుగుతున్నట్లు వెల్లడించారు. అనంతరం రామప్ప సరస్సును, ప్రధాన తూము పరిశీలించి పంటల సాగుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పాత్రికేయులు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతిపత్రం సమర్పించగా తొందరలోనే కేటాయించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

భయం భయంగా..

- అడవిలో పోలీసులను హతమార్చేందుకు మందుపాతరలు
- ఇటీవల కాలంలో రెండు ఘటనలు
- ఐఈడీఎస్‌ని వెలికి తీసిన పోలీసులు

ఏటూరునాగారం: మావోయిస్టులు పోలీసులను హతమార్చడానికి అమర్చిన మందుపాతరలు ప్రజలకు ప్రాణసంకటంగా మారాయి. జిల్లాలో రెండు మందుపాతరలు పేల్చిన సంఘటనలతో ప్రజలు భయాందోళనతో కాలం గడుపుతున్నారు. మావోయిస్టులు వాజేడు మండలం కొంగల గ్రామ సమీపంలోని కొంగలగుట్ట వద్ద అమర్చిన మందుపాతర పేలి ఈనెల 3న పేలి ఇల్లందుల ఏసు మృతి చెందిన సంఘటన తెలిసిందే. అలాగే గురువారం రాత్రి వెంకటాపురం(కె) మండలంలోని కర్రిగుట్ట అటవీ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

చెలిమెల అటవీప్రాంతంలో మందుపాతరల గుర్తింపు

ఇందులో భాగంగానే తెలంగాణ -ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దు గ్రామమైన కర్రిగుట్ట అటవీప్రాంతంలో ఎస్పీ శబరీష్ నేతృత్వంలో తనిఖీలు చేపట్టి ఈ నెల 5న వెంకటాపురం(కె) పోలీస్‌స్టేషన్ పరిధిలో చెలిమెల అటవీప్రాంతంలో మందుపాతరను గుర్తించి పోలీసులు, బాంబ్‌స్క్వాడ్ బృందం నిర్వీర్యం చేసింది. అలాగే తనిఖీలు ముమ్మరంగా చేయడంతో ఈనెల 9న వెంకటాపురం(కె) అటవీప్రాంతంలో బీడీ టీం బృందాలు, పోలీసులు తనిఖీలలో భాగంగా మావోయిస్టులు అమర్చిన మందుపాతరలను గుర్తించారు. నాలుగు ఐఈడీఎస్ బాంబులను గుర్తించగా అందులో మూడు బాంబు అప్పటికే పేలి ముళ్లపంది, ఒక కొండెంగ, ఒక పెంపుడు కుక్క చనిపోయి కళేబరాలు కనిపించాయి. మందుపాతర పేలకుండా ఉన్న మరో బాంబును వెలికితీశారు. మావోయిస్టులు వారి ప్లీనరీ సమయంలో చుట్టూ ప్రెషర్ బాంబులు, ఐఈడీఎస్ బాంబులను అమర్చి వారి ప్లీనరీ అయ్యే వరకు రక్షణ కవచంగా ఏర్పాటు చేసుకుంటారు.



పోలీసులు వెలికితీసిన మందుపాతరలు

ప్లీనరీ అనంతరం నిర్వీర్యం చేయలేదు..

ప్లీనరీ ముగిసిన తర్వాత వాటిని నిర్వీర్యం చేస్తుంటారు. కానీ ఇక్కడ ప్లీనరీలు జరిగిన తర్వాత వాటిని అలాగే వదిలేశారా లేక మావోయిస్టులు కూంబింగ్ వచ్చే స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్ దళాలను మట్టుపెట్టడానికి అమర్చినట్లుగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మావోయిస్టులు ఇటీవల మందుపాతర విషయంపై కూడా లేఖను విడుదల చేశారు. ఏదిఏమైనప్పటికీ మావోయిస్టులు అమర్చిన మందు పాతర ఎప్పుడు ఎవరి వద్ద పేలుతుందో అర్థంగానీ పరిస్థితి నెలకొంది.

భార్యపై దాడి.. భర్తకు జైలు

● రూ. 5వేల జరిమానా

నర్మెట: భార్యపై హత్యాయత్నం చేసిన భర్తకు జనగామ కోర్టు (అసిస్టెంట్ సెషన్స్ జడ్జి) పది సంవత్సరాల జైలు శిక్ష, రూ. 5 వేల జరిమానా విధించింది. పోలీసుల కథనం ప్రకారం.. రఘునాథపల్లి మండలం జాఫర్‌గూడేనికి చెందిన బత్తుల నర్సయ్యకు నర్మెట మండలం గండిరామారానికి చెందిన రజితతో వివాహం జరిగింది. కాగా, భార్యపై అనుమానం పెంచుకున్న నర్సయ్య.. 2022లో రజితపై గొడ్డలితో హత్యాయత్నం చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. వాదోపవాదనలు ముగిసిన అనంతరం గురువారం నిందితుడికి కోర్టు పది సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ. 5 వేల జరిమానా విధించింది. కాగా, బాధితురాలి తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది పీపీ స్టీఫెన్, సహాయకురాలు శ్రీదేవి, కోర్టు కానిస్టేబుల్ కరుణాకర్‌ను పలువురు అధికారులు అభినందించారు.

జువైనల్ హోం సూపరింటెండెంట్‌కు నోటీస్

వరంగల్: వరంగల్ ఆటోనగర్ సమీపంలోని జువైనల్ హోం(బాయ్స్)లో ఈనెల 2వ తేదీన డ్యూటీలో ఉన్న సూపరింటెండెంట్‌తోపాటు ఇతర ఉద్యోగులు మద్యం సేవించడంపై వివరణ ఇవ్వాలని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్(డీడీ) మీర్జా రజాలీ బేగ్, జువైనల్ హోం ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ రమణమూర్తికి నోటీసు జారీ చేసిన అంశం ఆలస్యంగా వెలుగు చూసింది. ఈనెల 2వ తేదీన మధ్యాహ్నం 3.30 గంటలకు డిప్యూటీ డైరెక్టర్ జువైనల్ హోంను తనిఖీ చేశారు. ఆ సమయంలో ప్రధాన ద్వారం మూసివేసి ఉండడంతో 10 నిమిషాలకు పైగా గేటును తట్టిన అనంతరం ఆఫీసు సబార్డినేట్ సునీల్ తెరిచారు. ఆ సమయంలో సూపరింటెండెంట్ ఎ.రమణమూర్తి, సూపర్‌వైజర్ ప్రశాంత్‌రెడ్డి, ఆఫీస్ సబార్డినేట్ సునీల్, వంట మనిషి ప్రదీప్ కుమార్ విధుల్లో ఉన్నట్లు తెలిసింది. ఈనేపథ్యంలో హాజరు పట్టికలో సంతకం చేసినవారి కోసం డీడీ 20 నిమిషాలకు పైగా హోంలోనే వేచి చూశారు. అప్పటివరకు భవనం మొదటి అంతస్తులో ఉన్న సూపరింటెండెంట్, సిబ్బంది 20నిమిషాల తర్వాత కిందకు వచ్చి డీడీతో మాట్లాడారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న వారి వద్ద నుంచి ఆల్కాహాల్ వాసన రావడం, వారి చర్యలు అనుమానాస్పదంగా ఉండడంతో డీడీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈవిషయంపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని నోటీసులో పేర్కొన్నారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

పరీక్షను తక్షణమే ఉపసంహరించుకోవాలి



వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

కాశీబుగ్గ సెంటర్: ఆశ వర్కర్లకు పరీక్ష నిర్వహించాలనే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉపసంహరించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు కాసు మాధవి డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం వరంగల్ కలెక్టరేట్ ఎదుట ఆశ వర్కర్లు ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. మాధవి మాట్లాడుతూ ఆశ వర్కర్లు గిరిజన ప్రాంతంలో 33 సంవత్సరాలు, మైదాన ప్రాంతంలో 13 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారన్నారు. ఇంత సీనియార్టీ ఉన్నా పరీక్షల్లో ఉత్తీర్ణులై జ్ఞాపకశక్తి పెంపొందించుకోవాలని ప్రభుత్వ చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇదే నిర్ణయాన్ని అమలు చేయాలని చూసినా పోరాటం కారణంగా ఎత్తివేసిందన్నారు. పరీక్ష నిర్వహణ నిర్ణయాన్ని పక్కనపెట్టి ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, ఆశ వర్కర్లు రాణి, ఉషా రాణి, సుజాత, మాధవీలత, రమ, పద్మ, మాధవి, రమాదేవి, మరియా, రజిత, ఆయూష, రాజేశ్వరి, కారుణ్య, స్వప్న, రమ పాల్గొన్నారు

బక్రీద్‌కు పొట్టేళ్లు రెడీ..



కాజీపేటలో పొట్టేళ్లను విక్రయిస్తున్న వ్యాపారులు

● 17న పర్వదినం
● నగరంలో జోరుగా అమ్మకాలు
● స్వల్పంగా పెరిగిన ధరలు

కాజీపేట : బక్రీద్.. త్యాగం, దానధర్మాలకు ప్రతీక. ఈ పర్వదినం రోజున ఖుర్బానీ ఇవ్వడం ముస్లింల ఆచారం. అనగా పేద ముస్లింలకు తమకు తోచిన మేర డబ్బు, దుస్తులు, ఆహారం రూపేణా సాయం చేయడం. ఈ సాయంతో వారు పండుగను ఘనంగా జరుపుకుంటారు. దీంతో బక్రీద్ వచ్చిందంటే రెండు మూడు రోజుల నుంచే పొట్టేళ్ల విక్రయాలు జరుగుతాయి. ఈ నేపథ్యంలో వరంగల్ నగరంలోని అనేక ప్రాంతాల్లో వారం రోజుల ముందు నుంచే పొట్టేళ్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. నగరంలో దాదాపు 25 ప్రాంతాల్లో పొట్టేళ్ల విక్రయాలు విరివిగా జరుగుతున్నాయి. ఈనెల 17న బక్రీద్ పండుగ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి ఇంకా పొట్టేళ్ల విక్రయాల కోసం నగరానికి వచ్చే అవకాశం ఉంది. ఈ పర్వదినానికి శరీరంపై ఎలాంటి గాయాలు లేని పొట్టేళ్లనే ఎక్కువగా ముస్లింలు కొనుగోలు చేయడానికి ఇష్టపడుతుంటారు. ధర ఎంతైనా సరే పొట్టేళ్లు మాత్రమే కొనుగోలు చేస్తారు. ఆర్థికంగా బలంగా ఉన్నవారు పొట్టేళ్లను రెండు, మూడు కూడా కోసుకుంటారు.

పొట్టేళ్ల విక్రయాల్లో కూడా ఏజెంట్లదే రాజ్యం..

పొట్టేళ్లను గ్రామీణ ప్రాంతం నుంచే అధికంగా విక్రయించేందుకు వస్తుంటారు. వారికి పరిచయం ఉన్న ఏజెంట్లు 'మేము అమ్మిస్తాం మాకు కమిషన్ ఇవ్వాలి' అని నమ్మించి విక్రయదారులను పక్కన పెట్టి ఏజెంట్లే ధర నిర్ణయించి తెలిసిన వారికి విక్రయించి లాభాలు గడిస్తున్నారనే వాదన వినిపిస్తోంది. ఈ ఏజెంట్ల వల్లే ధరలు పెరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు.

పొట్టేళ్ల ధర రూ..12వేల వరకు..

బక్రీద్ విక్రయాలకు వచ్చిన పొట్టేళ్ల ధరలు రూ.4 వేల నుంచి రూ.12వేల వరకు పలుకుతున్నాయి. గొర్రెలను ఉన్నది ఉన్నట్లు తూకం వేసి కిలోకు రూ.430చొప్పున అమ్ముతున్నారు. ఆరోగ్యంగా, బలంగా ఉన్న పొట్టేళ్లను గొర్రెల కాపరులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. గత సంవత్సరంతో పోల్చితే ఈ ఏడాది ధరలు కొంత ఎక్కువగానే ఉన్నాయని కొనుగోలుదారులు పేర్కొన్నారు. బక్రీద్ రోజు వరంగల్ నగరంలో దాదాపు 10వేలకు పైగా పొట్టేళ్లు కోస్తారని ముస్లింలు చెబుతున్నారు.

ఆదరణ బాగానే ఉంది



బక్రీద్ పండుగను దృష్టిలో ఉంచుకుని ఆరు నెలలపాటు పొట్టేళ్లను పెంచుతాం. ఇవి ఎంత ఆరోగ్యంగా ఉంటే అంత మంచి ధర వస్తుంది. ఆరు నెలల కష్టానికి తగిన గిట్టుబాటు ధర వస్తోంది.

-జక్కుల గట్టయ్య, మల్లక్‌పల్లి

‘ఓపెన్’ ఫలితాలు విడుదల

ఉమ్మడి జిల్లాలో టెన్త్‌లో 51.23 శాతం, ఇంటర్‌లో 57.85 శాతం ఉత్తీర్ణత

విద్యారణ్యపురి : తెలంగాణ రాష్ట్రంలో ఈ ఏడాది ఏప్రిల్- మే నెలలో నిర్వహించిన ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షల ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఈ పరీక్షల ఫలితాల వివరాలను హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై, ఉమ్మడి వరంగల్ జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ జిల్లాలు కలిపి టెన్త్ పరీక్షలకు 2,590 మంది హాజరుకాగా అందులో 1372 మంది (51.23శాతం) ఉత్తీర్ణత సాధించారు.ఇంటర్మీడియట్ పరీక్షలకు 4, 254 మంది హాజరుకాగా అందులో 2,461 మంది విద్యార్థులు (57.85శాతం) ఉత్తీర్ణత సాధించారు.

రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు అవకాశం

విద్యార్థులు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉంది. ఈ నెల 18నుంచి 27వరకు దరఖాస్తుల కోసం మీసేవ కేంద్రాల్లో ఫీజు చెల్లించుకునే అవకాశం కల్పించారు. టెన్త్‌లో రీకౌంటింగ్‌కు ప్రతి సబ్జెక్టుకు రూ. 350, రీవెరిఫికేషన్‌కు ప్రతి సబ్జెక్టుకు రూ. 1200 ఫీజు చెల్లించాల్సింటుంది. ఇంటర్మీడియట్‌లో రీకౌంటింగ్‌కు ప్రతి సబ్జెక్టుకు రూ. 400, రీవెరిఫికేషన్‌కు ప్రతి సబ్జెక్టుకు రూ .1200 చెల్లించాల్సి ఉంటుందని డీఈఓ అబ్దుల్‌హై తెలిపారు. మరిన్ని వివరాలకు ఉమ్మడివరంగల్‌జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు 8008403631 సెల్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

జిల్లాల వారీగా టెన్త్ ,ఇంటర్ పరీక్షల ఉత్తీర్ణత ఇలా..

- హనుమకొండ జిల్లాలో టెన్త్ పరీక్షలకు 304 మంది హాజరుకాగా అందులో 145మంది ఉత్తీర్ణత (47.70శాతం) సాధించారు. ఇంటర్‌లో 987 మందికిగాను 627మంది ఉత్తీర్ణత (63.53శాతం) సాధించారు.
- వరంగల్ జిల్లాలో టెన్త్‌లో 579 మందికిగాను 294మంది (50.78శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్‌లో 762 మందికిగాను 383 మంది (50.26శాతం) ఉత్తీర్ణత సాధించారు.
- మహబూబాబాద్ జిల్లాలో టెన్త్‌లో 589మందికిగాను 260 మంది ఉత్తీర్ణత (44.14శాతం) సాధించారు. ఇంటర్‌లో 747మందికిగాను 333మంది (44.58శాతం) విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.
- భూపాలపల్లి జిల్లాలోటెన్త్‌లో 249మంది విద్యార్థులకుగాను 26మంది (10.44శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్‌లో 404మందికి గాను 191మంది (47.28శాతం) ఉత్తీర్ణత సాధించారు.
- ములుగు జిల్లాలో టెన్త్‌లో 545మందికిగాను 367మంది(67.34శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్‌లో 684మందికి గాను 416మంది (60.82శాతం) ఉత్తీర్ణత సాధించారు.
- జనగామ జిల్లాలో టెన్త్‌లో324మందికిగాను 280 మంది(86.42)శాతం)ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్‌లో 670మందికిగాను 511మంది (76.27శాతం) ఉత్తీర్ణత సాధించారు. పరీక్షల ఫలితాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణ ఓపెన్‌స్కూల్.ఓఆర్‌జీలో చూసుకోవచ్చు.

టీజీ లాసెట్ ఫలితాలు విడుదల

విద్యారణ్యపురి: టీజీ లాసెట్ ఫలితాలు గురువారం విడుదల అయ్యాయి. వరంగల్ పరిధిలో 12 పరీక్ష కేంద్రాల్లో 2,819మంది అభ్యర్థులు పరీక్షలు రాయగా 2098మంది (74.42శాతం) ఉత్తీర్ణత సాధించారు. నర్సంపేట ప్రాంతంలోని రెండు పరీక్షకేంద్రాల్లో 352 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాగా అందులో 250మంది ఉత్తీర్ణత(71.02శాతం) సాధించారు.

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం



మాది మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని ఉప్పరపల్లి గ్రామం. ప్రస్తుతం నేను ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ ఆర్కియాలజీ చదువుతున్నా. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నా. ఇటీవల ఎడ్‌సెట్ ఫలితాల్లో 239వ ర్యాంకు వచ్చింది. ఐదేళ్ల లా కోర్సు ప్రవేశ పరీక్షలో 8వ ర్యాంకు రావడం సంతోషంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా చదువుతున్నా.

- అన్వర్ పాషా, లాసెట్ 8వ ర్యాంకర్

ముందుచూపుతోనే అధిక దిగుబడులు

● వ్యవసాయ విస్తరణ డైరెక్టర్ సుధారాణి



మాట్లాడుతున్న వ్యవసాయ విస్తరణ డైరెక్టర్ సుధారాణి

నెల్లికుదురు: వాతావరణానికి అనుగుణంగా ముందుచూపుతో అధికారుల సలహాలు పాటిస్తే వానాకాలంలో అధిక దిగుబడులు సాధించొచ్చని వ్యవసాయ విస్తరణ డైరెక్టర్ సుధారాణి అన్నారు. మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని చిన్నముప్పారం రైతువేదికలో రైతులకు వివిధ పంటలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అన్నదాతలు కచ్చితంగా అధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. అనంతరం కేవీకే మల్యాల ప్రోగ్రాం కోఆర్డినేటర్ మాలతి మాట్లాడుతూ ప్రతి రైతు పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ, జనుము, పిల్లిపెసర వేసుకుని జీవఎరువులైన ట్రైకోడర్మ, సూడోమోనాస్, పాస్ఫరస్ కరిగించే బ్యాక్టీరియాను వినియోగించాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి అభిమన్యుడు.. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు లేబుల్ లేని విత్తనాలు, లూజు విత్తనాలు లాంటి అంశాలపై వివరించారు. జిల్లా ఉద్యాన అధికారి జినుగు మరియన్న మాట్లాడుతూ రైతులు ఆయిల్ పాం పంటలు సాగు చేసి అందులో అంతర్ పంటగా కూరగాయల సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ఉమారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కధిర జగన్, సొసైటీ చైర్మన్ గుండ వెంకన్న, కేవీకే మల్యాల శాస్త్రవేత్తలు కిశోర్, క్రాంతి, ఏఓ నెలకుర్తి రవీందర్‌రెడ్డి, స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఏఈఓలు ముజాహిద్, సుమన్, ప్రవీణ్, శిరీష, చందన, కల్యాణి, అభ్యుదయ రైతులు నేతాజీ, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీర్‌లో ఫంగస్..



బీర్‌లోని ఫంగస్ చూపుతున్న యువకుడు

కొత్తగూడ: మండలంలోని పొగుళ్లపల్లిలోని ఓ బెల్ట్ షాపులో కొనుగోలు చేసిన ఓ కంపెనీ బీర్‌లో ఫంగస్ వచ్చింది. కొనుగోలు చేసిన యువకుడు బీర్ ఓపెన్ చేయకముందు గమనించడంతో ప్రమాదం తప్పింది. గమనించకుండా తాగి ఉంటే అనారోగ్యానికి గురయ్యేవాడనని ఆవేదన వ్యక్తం చేశాడు. అనంతరం బెల్ట్ షాపు వద్దకు వెళ్లి యజమానిని నిలదీయగా బీర్‌లోకి ఫంగస్ ఎలా వచ్చిందో తనకు తెలియదని సమాధానం ఇచ్చాడు. దీంతో సదరు కంపెనీపై కేసు వేసేందుకు వెనకాడబోనని యువకుడు తెలిపాడు. కాగా, ఈవిషయం సోషల్ మీడియాలో వైరలైంది. మందుబాబులు జర చూసుకుని తాగండి.. ఆగమాగం తాగి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

పోలీసులు నిబద్ధతతో పనిచేయాలి

● బెటాలియన్ డీఐజీ ఎంఎస్ సిద్ధిఖీ



మాట్లాడుతున్న టీఎస్ఎస్పీ డీఐజీ సిద్ధిఖీ

మామునూరు: పోలీసులు క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేస్తే గుర్తింపు లభిస్తుందని టీఎస్ఎస్పీ బెటాలియన్ల డీఐజీ ఎంఎస్ సిద్ధిఖీ అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా గురువారం ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్‌ను సందర్శించారు. కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డితో కలిసి బెటాలియన్ పరిపాలన భవనం, పరిసరాలను పరిశీలించారు. సిబ్బంది కల్పించిన వాతావరణం, పచ్చని చెట్లు, మొక్కలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. బెటాలియన్ ద్వారా అందిస్తున్న సేవలు వెల్ఫేర్ గ్రూప్, క్యాటర్ మాస్టర్ గ్రూప్, మోటార్ ట్రాన్స్‌ఫోర్ట్ కంపెనీలను సందర్శించి వాటి పనితీరు, రికార్డులు పరిశీలించారు. అనంతరం పరేడ్ గ్రౌండ్‌లో టీఎస్ఎస్పీ సిబ్బంది ప్రదర్శించిన కవాత్‌ను వీక్షించి, గౌరవ వందనం స్వీకరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించిన అనంతరం మాట్లాడారు. పోలీసులు విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీ కృష్ణప్రసాద్, శ్రీనివాస్, వీరన్న, వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ అన్వేషిని, ఆర్ఐలు శోభన్, పురుషోత్తంరెడ్డి, వెంకటేశ్వర్లు, కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ డిప్యూటీ మేయర్ ఇంట్లో చోరీ

● 16 తులాల బంగారం, రూ. 5,500 నగదు అపహరణ
● మరో రెండు ఇళ్లలో చోరీకి యత్నం



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీసీపీ అబ్దుల్ బారి, సీఐ మల్లయ్య

కాశిబుగ్గ : గ్రేటర్ వరంగల్ మాజీ డిప్యూటీ మేయర్ కక్కె సారయ్య ఇంట్లో చోరీ జరిగింది. గురువారం తెల్లవారుజామున ఇంట్లోకి చొరబడిన దొంగలు సుమారు 16 తులాల బంగారం, రూ. 5,500 నగదు అపహరించారని సారయ్య అల్లుడు, బాధితుడు నాగరాజు తెలిపారు. నాగరాజు కథనం ప్రకారం.. కక్కె సారయ్య కూతురు సుహాసిని అనారోగ్యానికి గురి కావడంతో తన భర్త యగ్గడి నాగరాజుతో కలిసి 35వ డివిజన్ శివనగర్ శ్రీగణపతినగర్ కాలనీ రోడ్డు నంబర్-3లోని తండ్రి ఇంట్లో ఉంటోంది. ఈక్రమంలో గత ఆదివారం ఓ ఫంక్షన్‌కు వెళ్లి వచ్చి సుహాసిని, నాగరాజు దంపతులు తమ ఆభరణాలను ఇంట్లోని బట్టలలో ఉంచి తాళం వేసి గ్రౌండ్ ఫ్లోర్‌లో సారయ్య వద్ద ఉంటున్నారు. ఈక్రమంలో దొంగలు తెల్లవారుజామున రెండో ఫ్లోర్‌లోకి వెళ్లి తాళం పగులగొట్టి బట్టలలో ఉన్న ఆభరణాలు, నగదును అపహరించారు. ఉదయం స్నానం చేద్దామని వెళ్లిన నాగరాజుకు తాళం పగులగొట్టి ఉండడంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూడగా బట్టలన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో మిల్స్‌కాలనీ పోలీసులు, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం సభ్యులు ఘటనా స్థలికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు. ఈ ఘటనపై బాధితుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య తెలిపారు. ఇదిలా ఉండగా ఇదే కాలనీలో మరో రెండు ఇళ్లలో దొంగలు చోరీకి యత్నం చేశారని తెలిసింది. ఈ ఘటనలతో శివనగర్‌వాసులు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ సరిగా చేయడం లేదని, దీంతో దొంగలు రెచ్చిపోతున్నారన్నారు. ఇప్పటికైనా పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని వారు కోరుతున్నారు.

బిర్యానీ తిని 8 మందికి వాంతులు

● ఇరువర్గాల మధ్య వాగ్వాదం
● పోలీస్ స్టేషన్‌కు చేరిన పంచాయితీ

కాజీపేట: కాజీపేట చౌరస్తాకు అతి సమీపంలో ఉన్న ఓ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో తిన్న బిర్యానీ వికటించడంతో 8 మంది కూలీలకు వాంతులు, విరోచనాలు అయ్యాయి. పాడైన బిర్యానీ విక్రయించడంతోనే తమకు వాంతులయ్యాయని బాధితులు గురువారం హోటల్ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హోటల్‌లో ఎంతో మంది బిర్యానీ తినగా మీకే ఎందుకు వాంతులు అయ్యాయని హోటల్ యజమాని ఎదురుతిరగడంతో సమస్య చిలికిచిలికి గాలివానగా మారి పోలీస్ స్టేషన్‌కు చేరింది. పోలీసులు ఇరువర్గాలకు నచ్చ చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. మున్సిపల్ ప్రజారోగ్య శాఖ అధికారులు కాజీపేటలో ఉన్న హోటళ్లపై తనిఖీలు చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. గతంలోనూ ఓ బిర్యానీ పాయింట్‌లో ఎలుక రావడంతో గొడవ జరిగిన విషయం విదితమే. ప్రజల ఇష్టాన్ని గుర్తించిన పలువురు వ్యాపారులు మూడు, నాలుగు చొప్పున సెంటర్లు ఏర్పాటు చేసి బిర్యానీ విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సెంటర్లపై అధికారుల తనిఖీలు కరువడంతో తరచూ గొడవలు జరుగుతున్నట్లు పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీహరి



మాట్లాడుతున్న శ్రీహరి

కేయూ క్యాంపస్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని కాకతీయ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సోము శ్రీహరి అన్నారు. గురువారం కేయూ కెమిస్ట్రీ విభాగంలోని సెమినార్ హాల్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ అధ్యాపకులకు ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా 'పర్యావరణ కాలుష్యం' అనే అంశంపై విస్తృత ఉపన్యాసం చేశారు. ముఖ్యంగా వ్యవసాయంలో పరిమితికి మించి రసాయనాల వినియోగం, గృహపారిశ్రామిక వ్యర్థాల నిర్వహణ సరిగా లేకపోవటం వంటివి కూడా పర్యావరణానికి ప్రతికూలంగా మారుతున్నాయన్నారు. ఉపాధి, వ్యవసాయం పేరుతో అడవిని నాశనం చేయడం నగరాల్లో చెట్లను పెంచలేకపోవడం, సాంకేతికత అభివృద్ధి తరుణంలో ఆధునిక యంత్రాలు, వాహనాల ద్వారా వచ్చే ధ్వని వాయు, కాలుష్యాలు పెరగడంతో మానవ జీవనంపై ప్రభావం పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. విభాగం అధిపతి డాక్టర్ సవితాజ్యోత్స్న, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

● ఎదురెదురుగా ఢీకొన్న బైక్‌లు.. కిందపడిన వాహనదారులు
● ట్రాక్టర్ మీదినుంచి వెళ్లడంతో ఒకరు, చికిత్స పొందుతూ మరొకరు మృతి



రాజయ్య (ఫైల్)



బాపు(ఫైల్)

కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం దామెరకుంట సమీపంలోని దుబ్బపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన కాపరబోయిన రాజయ్య(48), దామెరకుంటకు చెందిన ఐలాపురం బాపు(45) బైక్‌పై దామెరకుంట నుంచి విలాసాగర్ వైపునకు వస్తున్నారు. మల్హర్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై విలాసాగర్ నుంచి దామెరకుంట వైపునకు అతివేగంగా వెళ్తూ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్నారు. దీంతో రాజయ్య, బాపు.. బైక్‌పై నుంచి రోడ్డుపై ఎగిరిపడి తీవ్ర గాయాలపాలయ్యారు. అదేసమయంలో దామెరకుంట వైపుగా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ రోడ్డుపై పడిన రాజయ్య, బాపును గమనించక పైనుంచి వెళ్లడంతో రాజయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన బాపును భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాజయ్య దామెరకుంట ఆయూష్ దవాఖానలో అటెండర్‌గా పని చేస్తున్నాడు. మృతుడికి భార్య మల్లీశ్వరి, కుమారుడు, కూతురు ఉన్నారు. బాపు వడ్రంగి పని చేస్తూ జీవనం సాగిస్తుండగా భార్య గతంలో మృతి చెందింది. ఘటనా స్థలిని సీఐ నాగార్జునరావు, ఎస్సై మ్యాక అభినవ్ పరిశీలించి ప్రమాద వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ ఘటనపై రాజయ్య భార్య మల్లీశ్వరి ఫిర్యాదు మేరకు ప్రమాదకారకులైన ద్విచక్రవాహనదారుడు శ్రీనివాస్, ట్రాక్టర్ డ్రైవర్ ఆంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఘటనా స్థలి వద్ద ఆందోళన..

రోడ్డు ప్రమాద ఘటనా స్థలి వద్ద మృతుల కుటుంబీకులు, బంధువులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. బైక్ అతివేగం, ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ అతివేగం, అజాగ్రత్త కారణంగా రాజయ్య, బాపు మృతి చెందారని ఆరోపిస్తూ రోడ్డుపై బైఠాయించారు. ఇరు కుటుంబాలకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఘటనా స్థలికి చేరుకున్న సీఐ, ఎస్సై బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

స్మార్ట్ సిటీ మిషన్ డైరెక్టర్‌ను కలిసిన కమిషనర్



వరంగల్ అర్బన్: స్మార్ట్ సిటీ మిషన్ డైరెక్టర్-జాయింట్ సెక్రటరీ కునాల్‌కుమార్‌ను గురువారం ఢిల్లీలో గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి ఆయనతో కొద్ది సేపు పథకం తీరుపై చర్చించారు. అనంతరం కేంద్ర పట్టణ గృహ నిర్మాణ శాఖ పరిధిలో భాగంగా నగరంలో స్మార్ట్ సిటీ పథకంలో ఇప్పటి వరకు చేపట్టిన, చేపట్టబోయే ప్రాజెక్టుల వివరాలు, నిధుల మంజూరు తదితర అంశాలపై చర్చించారు.

సదరన్ రైల్వే రన్నింగ్ స్టాఫ్‌కు సంఘీభావం



సంఘీభావం తెలుపుతున్న అసోసియేషన్ బాధ్యులు, లోకో పైలెట్లు

కాజీపేట రూరల్: సదరన్ రైల్వే ఏఐఎల్ఆర్ఎస్ఏ ఆధ్వర్యంలో చేపట్టిన లోకోపైలట్ల డిమాండ్ల సాధన నిరసనకు గురువారం కాజీపేట ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్(ఏఐఎల్ఆర్ఎస్ఏ) సంఘీభావం ప్రకటించింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. లోకో పైలెట్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు. 46గంటల రెస్ట్ ఇవ్వాలని, డ్యూటీ రెస్ట్ తర్వాత పిరాడికల్ రెస్ట్ ఇవ్వాలని, రెండు నైట్లు డ్యూటీ తర్వాత మూడో హెడ్ క్వార్టర్‌లో రెస్ట్ ఇవ్వాలని, 10 గంటల పని విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సదరన్ రైల్వే లోకో రన్నింగ్ స్టాఫ్ ఆధ్వర్యంలో లోకోపైలెట్ల డిమాండ్లు పరిష్కరించాలని సౌత్ జోన్ రైల్వే జీఎంకు వినతి పత్రం మెయిల్ ద్వారా పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాజీపేట ఏఐఎల్ఆర్ఎస్ఏ నాయకులు ఏవీఎస్ఎస్.మూర్తి, సుదీర్‌కేసీ, గోవిందరాజులు, లోకోపైలెట్లు, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ నాణ్యమైన వైద్యం అందాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఎంజీఎం: ప్రజారోగ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందాలని తెలంగాణ వైద్య మండలి (టీజీఎంసీ) వైస్ చైర్మన్ జి.శ్రీనివాస్ సూచించారు. గురువారం వరంగల్‌కు విచ్చేసి నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వరంగల్ యాంటీ క్వాకరీ బృందం సభ్యులు, జూనియర్ డాక్టర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. టీజీఎంసీ ద్వారా వరంగల్ యాంటీ క్వాకరీ బృందం నిర్వహిస్తున్న తనిఖీలు, నకిలీ వైద్యులపై తీసుకుంటున్న చర్యలపై ప్రశంసించారు. ఎన్ఎంసీ ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారుల సంఖ్య పెంచి కేసులు త్వరితగతిన ఎఫ్ఐఆర్ చేసి, కోర్టు ద్వారా ఆర్ఎంపీ / పీఎంపీ అని బోర్డులు పెట్టుకునే నకిలీ వైద్యులకు ఎన్ఎంసీ చట్టం ప్రకారం శిక్షపడే విధానాలపై చర్చించి బృందం సభ్యులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో వరంగల్ యాంటీ క్వాకరీ బృందం సభ్యులు డాక్టర్ వి.నరేశ్‌కుమార్, అజిత్ పాషా, వెంకట్‌యాదవ్, హెచ్ఆర్‌డీఏ వరంగల్ అధ్యక్షుడు డాక్టర్ కె.వెంకటస్వామి, జూనియర్ డాక్టర్ల సంఘం నాయకుడు డాక్టర్ శ్రీనాథ్, ఐఎంఏ జూనియర్ డాక్టర్స్ నాయకుడు డాక్టర్ నవదీప్ పాల్గొన్నారు.